కామెడీ కథ

# నాటీ నిరంజనం

ఎవరి జీవితంలో ఎప్పుడు ఎలాంటి మార్పు వస్తుందో ఎవరూహించగలరు? నిన్నటి దాకా సొంత కారులో తిరిగిన వాడి రాత అష్టవంకర్లయిపోయి, సైకిలు రిక్షా ఎక్కాల్సి రావచ్చు. డొక్కు సైకిలు తొక్కేవాడి దశ తిరిగి మాటిజ్ కారు ఓనరయిపోవచ్చు. అంతా ఆ పై వాడి లీల.

లీల కాకపోతే, పుట్టినప్పుడు పెట్టిన ఏడుపు ముఖాన్ని అలాగే కంటిన్యూ చేసుకుంటూ నలభయ్యయిదేళ్ళ పాటు ధుమ ధుమ లాడుతూ లాగిస్తున్న బతుకు బండిని ఒక్కసారిగా సైడ్ ట్రాక్ పట్టించిన నిరంజనం సంగతి ఏమిటంటారు?

నవ్వు అంటే తెలీని తిర్యగ్జంతువులకైనా ఎప్పుడైనా నవ్వొస్తుందేమోగానీ, మన ఎన్. నిరంజనానికి మాత్రం నవ్వంటే ఏమిటో తెలీదు. ఎవరైనా పలకరిస్తే, చిరునవ్వు నవ్వుతాం. కానీ మనవాడికి మూతి మరింత ముడుచుకుపోతుంది. నుదురు మరో నాలుగు ముడతలు పడుతుంది. కామెడీ సినిమాలు చూపించి అప్పటికీ నవ్వకపోయేసరికి చంకల్లో చక్కిలిగింతలు పెట్టి మరీ నవ్వించుదామని చూసిన మిసెస్ నిరంజనానికి, పాపం నిరాశే మిగిలింది.

ఆనందం, సంతోషం అయ్యన డిక్షనరీలోనే లేవు. ఎల్లప్పుడూ దీక్ష పూనినట్లు శోకభరిత ముఖారవిందంతో విలసిల్లుతూ పాతికేళ్ళుగా ఉద్యోగ భారాన్ని వహిస్తూ నెట్టుకొస్తున్న నిరంజనం, ఈరోజు ముఖంలో మతాబులు వెలిగినంత సంతోషం కురిపించాడంటే ఎంతాశ్చర్యం?

ముషారఫ్ కాశ్మీరుని మాకొద్దు, అచ్చంగా మీరే వుంచుకోండంటే కూడా ఇండియా ప్రధానికి అంత ఆశ్చర్యం కలగదేమో!

అసలు ఆ రోజేమయిందంటే...

నిశ్శబ్దంగా వుంది సెక్షను. అప్పుడప్పుడూ కదిలే పేపర్ల సడి తప్ప మరే శబ్దం లేదు. ఫైలు లోపలికి తలకాయ దూర్చేసి, తప్పులు వెతకడంలో బిజీగా వున్నాడు నిరంజనం. క్లర్కు విశాలాక్షి ఏకాగ్రతతో తెల్లకాగితాన్ని నలుపు చేస్తోంది చుక్కల్ని కలుపుతూ, మరి వచ్చేది సంక్రాంతి పండుగ కదా! గోళ్ళ రంగుకి సెకండ్ కోటింగ్ యిస్తూ టైపిస్టు రత్నకుమారి, ఇయర్ ఫోన్‌లో పాటలు వింటూ కుమార్ బాబూ కూడా చాలా బిజీగా వున్నారు. ప్రభుత్వ ఆఫీసు కావటం నుంచి ఆఫీసు పని తప్ప అన్ని పనులు ఆఫీసు సమయంలోనే చేసుకోవాలన్న నియమం నిరంజనానికి తప్ప అందరికీ తెలుసు.

ఎన్.నిరంజనం ఇంటి పేరేమిటోగానీ, అందరికీ నిర్వికార నిరంజనంగానే తెలుసు. ఎర్రసిరాతో మార్కింగులు చేసుకుంటూ, ఆకుపచ్చ సిరాతో సంతకాలు పెడుతూ నాలుగు చేతుల పని రెండు చేతుల్తో చేస్తున్న నిరంజనం, తలెత్తి చూసాడు, ఎవరో ఆడగొంతు విన్పించేసరికి.

"ఎక్స్‌క్యూజ్‌మి సర్" టూత్‌పేస్ట్ అడ్వర్టయిజ్‌మెంట్లా పళ్ళన్నీ బయటపెడుతూ ఎదురుగా నిల్చుని వుందో జీన్స్ పాంట్ అమ్మాయి.

"సారీ! ఐ హావ్ నో టైమ్" మళ్ళీ తలకాయని ఫైల్లోకి పాతిపెట్టేస్తూ అన్నాడు నిరంజనం.

'రోజుకు నాలుగు తక్కువ కాకుండా గిరాకీలు తగుల్తుంటాయి ఇలాంటివి. అవి కొనండి, ఇవి కొనండి అంటూ వెంటపడి ప్రాణం తీసే సేల్స్‌పీపుల్‌కి, ఫ్రీ ఎంట్రీ ఈ ఆఫీస్‌లో' మనసులోనే విసుక్కున్నాడు.

"హలో! మీరేం కొనకపోయినా పర్లేదు సర్. జస్ట్ కొంచెం ఇన్ఫర్మేషన్ ఇస్తే చాలు. యం.బి.ఏ. స్టూడెంట్‌ని. మార్కెటింగ్ రీసెర్చ్ చేస్తున్నాను. ఈ రీసెర్చ్ రిపోర్ట్స్ వల్ల కలిసే మార్క్స్ వల్లనే మా పాస్ పర్సెంటేజీ పెరుగుతుంది. ప్లీజ్" జలధారలాగా స్వచ్ఛమైన అవిరళమైన ఇంగ్లీష్‌లో అంది ఆ అమ్మాయి.

కొంచెం మెత్తబడినా, బయటికి మాత్రం బింకంగా "సారీ! మీకు చెప్పాను కదా! నాకు టైం లేదు. అయామ్ క్వయిట్ బిజీ" ధుమధుమల్ని కంటిన్యూ చేశాడు నిరంజనం.

"మీలాంటి యంగ్‌మెన్ కూడా అలా అంటే ఎలాగండి? ఈ సర్వేలో మీరు చేసే హెల్ప్ వల్ల అల్టిమేట్‌గా మీకే బెనిఫిట్. ప్లీజ్ సర్"

యంగ్‌మెన్ అన్న పదం వినేసరికి నిరంజనానికి మతిపోయింది. ద్వీపకల్పంలా వున్న బుర్రమీద తడుముకుని చూసుకున్నాడు. జోక్ చేస్తోందేమో ఈ జీన్స్ పాంట్ బుల్లెమ్మ అనుకుని, ఆమె వంక తేరిపార చూశాడు. కొంచెం కూడా వేళాకోళం లేని, నిజాయితీగా వున్న ఆ పిల్ల ముఖం చూసేసరికి, ఆ అమ్మాయి చెప్తోంది నిజమే అని గట్టిగా నమ్మేసాడు.

"ఓ.కె. కూర్చోండి" ఇష్టం లేనట్లుగా నటిస్తూ అన్నాడు నిరంజనం.

"థాంక్యూ. థాంక్యూ వెరీ మచ్. మీ పేరు"

చెప్పాడు.

"ఎన్ ఫర్ నాటీయా" నవ్వుతూ అడిగింది బుల్లెమ్మ.

జిల్లుమంది నిరంజనానికి. 'నాటీ' ఎంత బ్యూటీగా వుంది ఆ పేరు.

"మీ ఏజ్! ట్వెంటీ ఎయిట్ అండ్ థర్టీ మధ్యలో వుండొచ్చు అనుకుంటున్నాను. యామై రైట్" చిలిపి కళ్ళతో మరో ప్రశ్న.

'మరోసారి జిల్లు!'

"నో.. నో... అయాం ఫార్టీ ఫైవ్ ఇయర్స్ ఓల్డ్" ఆడపిల్లలా సిగ్గుపడ్డాడు.

"యూ ఆర్ రియల్లీ నాటీ సర్. ప్లీజ్ నిజం చెప్పండి. మీ ఏజ్ ఎంత?" ముక్కుని నోటి దగ్గరగా తెచ్చుకుని ముద్దు ముద్దుగా అడిగింది బుల్లెమ్మ.

నిజంగా తను అంత చిన్నవాడిలాగా కనపడుతున్నాడా! తనకు అస్సలు తెలీలేదు ఇన్నాళ్ళూ. ప్చ్. అనవసరంగా మొన్నీమధ్య తనకు మనవడు పుట్టిన సంగతి ఆఫీస్‌లో చాలామంది దగ్గర చెప్పేశాడు.

"ఓ.కె. మీకు వయసు చెప్పటం ఇష్టం లేకపోతే వదిలెయ్యండి. మరో చిన్న ప్రశ్న. ఆర్యూ మారీడ్."

మరోసారి గుండె ఝల్లు. ఇంకా బ్యాచిలర్ లాగా కన్పిస్తున్నాడన్నమాట తను. ఒరేయ్ నిరంజనం! నీ గురించీ, నీ హ్యాండ్‌సమ్ పెర్సనాలిటీ గురించి నీకు ఇన్నాళ్ళూ తెలీకపోవడమేంట్రా వెర్రి వెధవా!- మనసు ఆనందంతో పొంగి పొర్లిపోతుండగా,

"అఫ్ కోర్స్. అయాం ఎ మ్యారీడ్ పర్సన్"

"అంటే మీ ఆఫీస్‌లో చాలామంది లేడీస్‌కి మీ మిసెస్ పైన చాలా జెలసీ వుండి వుండాలి, ఇంత హాండ్‌సమ్ ప్రిన్స్‌ని సొంతం చేసుకున్నందుకు" ఆరాధనతో ఆ పిల్ల కళ్ళు నియాన్ లైట్లలా మెరుస్తున్నాయ్.

'పుట్టినప్పటి నుండీ బ్రతికున్న వాడెవడూ తననీ, తన అందాన్నీ గుర్తించిన సంఘటన ఒక్కటి కూడా లేదు. చివరికి తన భార్య కూడా- తనను, తన అందాన్ని మెచ్చుకున్న పాపాన పోలేదు. అలాంటిది, ఇంత అందమైన, అల్ట్రామోడ్రన్ పిల్లకి తను నచ్చాడంటే, ఓహ్! హౌ లక్కీ అయామ్!'

అదిగో! అప్పుడే పుట్టి బుద్ధెరిగాక జరగని ఓ అద్భుతం జరిగిపోయింది. నిరజనం నవ్వాడు. మీసాల చాటునుండీ దూసుకు వచ్చిన నవ్వు తాలూకు శబ్ద తరంగాలు సెక్షన్ అంతా నిండిపోయాయి.

విశాలాక్షి ముగ్గు చుక్క తప్పింది.

రత్నకుమారి గోళ్ళ రంగుని వేలినిండా పూసేసుకుంది.

కుమార్‌బాబు ఇయర్ ఫోను చొక్కా లోపలికి జారిపోయింది.

నిరంజనం నవ్వు మాత్రం కంటిన్యూ అయింది.



"చెప్పండి మేడమ్. మీకేం కావాలి? ఇంకా ఏమయినా ఇన్‌ఫర్మేషన్ కావాలంటే అడగండి. అభ్యంతరం లేదు." ఈ చెవి నుండీ ఆ చెవి దాకా సాగింది నవ్వుతున్న నిరంజనం నోరు.

"ఏం లేదు. ఇదిగో వీటిని చూడండి" చల్లగా కబురు చెప్పింది. బ్రీఫ్‌కేస్‌లోంచి టీ షర్ట్స్ బయట పెట్టింది.

"సర్! ఇవి చూడండి. ఇవి చాలా పేరున్న కంపెనీకి చెందిన బ్రాండెడ్ టీ షర్ట్స్. మీ కలర్ కాంప్లెక్షన్‌కి, ఫిజిక్‌కి సరిగ్గా సరిపోతాయి. కుట్లు ఊడవు. ష్రింక్ అవవు, ఫేడ్ అవవు. అందుకు నేను గ్యారంటీ. మీకు నచ్చితేనే తీస్కోండి. బలవంతం లేదు. ఇందులో నాకు వచ్చే ప్రాఫిట్ ఏమీ లేదు. నా సర్వే ఎనాలిసిస్‌కి సహాయం చేసినట్టవుతుంది. మీరు తీసుకుంటే" కనురెప్పలు మూస్తూ, తెరుస్తూ అందమైన ఇంగ్లీషు అభ్యర్థన అది.

"కానీ... కానీ... ఇవి నాకు ఎలా సరిపోతాయ్. చాలా చిన్న సైజువి కదా!" అప్పటికే అయినయిపోయిన నిరంజనం తేరుకుంటూ అన్నాడు. నిజానికి తన మనవడికి అయిదో ఏటికి పుట్టినరోజు గిఫ్ట్‌గా ఇవ్వొచ్చు, వాటిని.

"ఓ అదా మీ డవుట్! మీలాంటి మోడ్రన్ యంగ్ మ్యాన్‌కి తెలిసి వుండాలే ఇవి స్ట్రెచబుల్ టీ షర్ట్స్ అని. ఎంత కావాలంటే అంత సాగుతాయి. మీకు ఫార్టీ ఇయర్స్ వచ్చినా సరిపోతాయ్" ఒక షర్ట్‌ని చేతులతో బాగా సాగదీసి చూపించింది.

అంటే నిజంగానే తనని ముప్పయేళ్ళవాడిగానే అనుకుంటోంది అన్నమాట ఈ పిల్ల.

"సరే! ఇంతకీ వీటి రేటు"

"రేటేముంది సర్. ప్రాఫిట్ ఒరియంటెడ్ కాదు కదా! జస్ట్ మూడు వందల తొంభై తొమ్మిది రూపాయలు అంతే!"

యవ్వనం తాలూకు అనుభూతిని మనసులోనే అణుచుకుంటూ ఎనిమిది వందల రూపాయల్ని, ఎనిమిది రూపాయలన్నంత తేలికగా ఆ అందగత్తెకి అర్పించి, ముదురు ఎరుపురంగుది ఒకటి, పసుపు పచ్చది ఇంకొకటి ఏరుకున్నాడు నిరంజనం.

"థాంక్యూ సర్. థాంక్యూ వెరీ మచ్" నిరంజనం చెయ్యిలాక్కుని మరీ షేక్‌హ్యాండ్ ఇచ్చి వీడ్కోలు తీసుకుంది జీన్సుపాంటు బుల్లెమ్మ.

జన్మలో ఆడపిల్ల చెయ్యి పట్టుకుని ఎరగడు నిరంజనం. పెళ్ళాం చేతిని తప్ప, ఆ స్పర్శ తాలూకు వైబ్రేషన్స్ ముంజేతి నుండి ముఖం దాకా ప్రాకి నవ్వు రూపంలో అలా, అలా బయటకొస్తూనే వున్నాయి ఆ రోజు నుంచీ.

★ ★ ★

**పద్మలతా జయరాం**

"హాయ్! గుడ్ మార్నింగ్ ఎవ్విరిబడీ!"

అప్పటిదాకా ఎవరబ్బా ఈ శాల్తీ అని మథనపడుతున్న స్టాఫ్ అంతా గొంతు గుర్తుపట్టి అయ్యబాబోయ్ ఈ దసరా బుల్లోడు మన నిర్వికార నిరంజనమా అని నోళ్ళు వెళ్ళబెట్టారు.

ఎర్రటి టీ షర్ట్‌ని బలవంతంగా ఇరికించిన శరీరం ఆపసోపాలు పడుతోంది. ముందుకు పొడుచుకొచ్చిన పొట్ట బోర్లించిన కుండలా వుంది. దాని క్రింద స్కిన్ టైట్ పాంట్ క్రీమ్ కలర్‌లో ఒంటి మీద వుండనా, వద్దా అన్నట్లుంది. మీసాలు తీసేసిన మూతి, దానికి కొంచెం పైన నల్లటి కళ్ళద్దాలు, ఆ పైన నిండుగా పూసిన నల్లని రంగులో జుత్తు.

ఓహ్!

నిరంజనం రూపమే మారిపోయింది.

చేతిలో కీ బంచ్‌ని గిరగిరా త్రిప్పుతూ మళ్ళీ అన్నాడు.

"గుడ్ మార్నింగ్"

"వెరీ, వెరీ గుడ్ మాణింగ్ సర్. అసలు మీరు, మీరు..." మాట తడబడుతోంది విశాలాక్షికి.

"యస్... ఇటీజ్ మీ. నేనే" గర్వంగా నవ్వుతూ అన్నాడు.

ఇక సెక్షన్ స్టాఫ్‌కే కాదు, ఆఫీసు మొత్తం అందరికీ ఈ ఎనిమిదో వింత ఎగ్జయిటింగ్‌గానే వుంది. స్లీవ్‌లెస్ జాకెట్‌లా వున్న టైట్ టీ షర్ట్‌తో ఆ రోజంతా ఆఫీసు కాంపౌండ్‌లో

చాలాసార్లు పచార్లు చేసాడు నిరంజనం. కనిపించిన లేడీ స్టాఫ్ అందరి వంకా చిరునవ్వులు చిందిస్తూ చూసాడు. ఆడా, మగా తేడా లేకుండా అందరికీ షేక్‌హ్యాండ్ ఇచ్చే ప్రోగ్రాం మొదలుపెట్టాడు. యవ్వనం తాలూకు ఉద్రేకం తెలిసేది అది దాటిపోయాకే కదా! క్యాంటీన్లో, క్లబ్బులో ఎక్కడ పదిమంది జనం కూడారో, అక్కడంతా నిరంజనమే ఆ రోజు. ముఖం తిప్పుకుని నవ్వుకునే మహిళామణులు కొందరయితే, నిరంజనం ముఖం మీదే వెక్కిరింతగా నవ్వేవాళ్ళు మరికొందరు. అయినా అవేవీ పట్టించుకునే స్థితిలో వుంటే కదా మన హీరో.

"గురువుగారూ! అదిరిదండీ మీ డ్రెస్సింగ్. ఎవరి సెలక్షన్ సార్" ఓ కొంటె కుర్రాడి కామెంట్.

"థాంక్యూ! థాంక్యూ వెరీమచ్! సెలక్షన్ మనదే" గర్వంగా చెప్పాడు నిరంజనం.

"మెళ్ళో ఓ చెయిన్, చేతికి బ్రేస్‌లెట్ వుంటే మంచి గెటప్ వచ్చేది సార్. ఓ సిగార్ స్మోక్ చేస్తూ పోజిచ్చారనుకోండి, వావ్! బ్రహ్మాండమైన రాడ్ తయారవుతుంది. కదూ గోపాల్" నిరంజనాన్ని మునగచెట్టెక్కించాడు మరో కొంటె కోణంగి.

"ఊరికే కళ్ళకి విందు చూస్తే ఏం లాభం సార్. కాస్త మా కడుపు కూడా నింపండి. నజర్ తగలకుండా వుంటుంది"

"డెఫినెట్‌గా అరేంజ్ చేయిస్తాను" ప్రామిస్ చేశాడు నిరంజనం.

* * *

"అబ్బా! ఏవిటండీ ఈ అవతారం. బుడబుక్కలవాడి లాగా. ఆ చొక్కా ఏమిటి ఒంటికి అంటుకుని? ఆ జీన్స్ ప్యాంట్ ఏమిటి? ఈ గుడ్డివాళ్ళ కళ్ళజోడేమిటి? తీసేయండి బాబూ. ఛస్తున్నాను చూడలేక. ప్లీజ్" బ్రతిమిలాడ సాగింది నిరంజనం శ్రీమతి.

"నథింగ్ డూయింగ్. మరో రెండు పెయిర్స్ కొనుక్కోవాలి నేను. నీలాంటి అప్పలమ్మలకేం తెలుసు, మోడ్రన్ ట్రెండ్స్. ఇష్టమయితే రా సినిమాకి. లేకపోతే నేనొక్కణ్ణే వెళ్తాను" అల్టిమేటమ్ ఇచ్చాడు నిరంజనం.

కొత్తగా మొదలయిన ఈ ఫ్యాషన్ జ్వరం ఎప్పటికి తగ్గుతుందో అర్థం కావట్లేదు నిరంజనం భార్యకి. టైటు డ్రస్సులు, దొంగ చూపులు, అనవసరపు పలకరింపులు ఎబ్బెట్టుగా వుండి, చుట్టుప్రక్కల వాళ్ళ చూపులు ముళ్ళలా గుచ్చుకోసాగాయి ఆవిడకి. ఇన్నాళ్ళూ తనేదో, తన పనేదో తప్ప పొరపాటున కూడా ప్రక్కవాళ్ళని పలకరించిన పాపాన పోని తన భర్త, ఈమధ్య రంగురంగ డీలా తయారయి పనిగట్టుకుని వాళ్ళతో మాట్లాడటం ఏవిటో, ఆడవాళ్ళ ముందు ఫోజులు కొడుతూ తిరగటం ఏవిటో, ఆవిడకి తలకొట్టేసినట్లుగా వుంది. అనలు ఆఫీసు నుంచి వస్తూ ఏ అమావాస్య రాత్రి పూటో ఏవైనా తొక్కాడో ఏవిటో అని, శాంతి చేయిద్దామా అనే ఆలోచనల్లో కూడా పడింది. డిగ్రీ చదివే కొడుకయితే "హమ్మో! నేను నాన్నతో ఎక్కడికీ వెళ్ళనే అమ్మా! అమ్మాయిలకి సైటు కొడుతున్నాననుకుని, నాన్నతోపాటు నన్నూ ఎముకలిరగ్గొడతారు జనాలు" అనేశాడు.

* * *

"అరె! జరగవయ్యా. ముందుకు జరుగు జెల్దీ. టికెట్లయిపోయినయ్యంటారు వాళ్ళు" వెనక నుండీ తోసాడో శాల్తీ, నిరంజనాన్ని.

కొత్త సినిమా ఫస్ట్‌షోకి తానొక్కడే వచ్చాడు భార్యా, పిల్లలూ రామనడంతో.

కాలేజీలు ఎగ్గొట్టి బాయ్ ఫ్రెండ్స్‌తో వచ్చే అమ్మాయిలూ, చేతిలో ఓ బండి వుంచుకుని ఆడపిల్లలకి సైటు కొట్టే పోకిల్లారాయుళ్ళూ నిండిపోయారు థియేటరంతా. అంత మంది మధ్యలో, అడ్-మ్యాన్-అవుట్‌లా వున్నాడు నిరంజనం. ఆకుపచ్చ టీ షర్ట్, నలుపురంగు స్కిన్ టైట్ జీన్స్ తగిలించుకుని, కళ్ళజోడు చాటు నుంచి ఓర చూపులు చూస్తున్న నిరంజనాన్ని రకరకాల పేర్లతో పిలుచుకుంటూ వినోదిస్తున్నారు కుర్రకారు.

ఇంతలో టికెట్ ఇష్యూ మొదలయింది.త్రొక్కిసలాట.

ఒకళ్ళని తోసి ఇంకొకళ్ళు టికెట్లు తెచ్చుకోవాలని ఆరాటపడిపోతూ దూసుకుపోతున్నారు జనం.

"కుర్రోళ్ళ మధ్య మీరెందుకు సారూ! ఓ వారం పోయినాక రాకూడదా సినిమాకి" చేతిలో కర్రతో అదిలిస్తూ లైన్ మెయింటైన్ చేయిస్తున్న ఖాకీ డ్రస్సాయన అన్నాడు నిరంజనంతో.

తనని కానట్లే అటువైపు అస్సలు చూడకుండా క్యూతో పాటుగా కదుల్తున్నాడు నిరంజనం.

"అంకుల్! అంకుల్!"ఎవరో ఆడగొంతు విన్పించేసరికి ప్రక్కకు తిరిగి చూసిన నిరంజనానికి, ఆ రోజు ఆఫీసులో టీ షర్టులు అంటగట్టిన అందాల బుల్లెమ్మ కనిపించింది. నరాలు జిల్లుమన్నాయి. ఇప్పుడు కూడా జీన్స్‌ప్యాంట్‌లోనే వుంది ఆ పిల్ల.కానీ ఆ పిలుపే ఇబ్బందిగా అనిపించింది నిరంజనానికి.

"అంకుల్! ప్లీజ్ ఒక రెండు టికెట్స్ తీస్కోరా! ఈ క్యూలో నిల్చుంటే ఎల్లుండికి కూడా టికెట్లు దొరికేలా లేవు" నిరంజనాన్ని గుర్తుపట్టలేదు ఆ పిల్ల.

"ఓ! ష్యూర్! మీరు యం.బి.ఏ. స్టూడెంట్ కదూ? హిహిహి! అయామ్ నిరంజన్. గుర్తు పట్టారు కదూ! ఈ టీషర్ట్ మీ బ్రాండ్‌దే. డు యూ రికగ్నయిజ్ మీ" ఆనందం పట్టలేకపోతున్నాడు.

"ఓహో! మీరా! గుర్తొచ్చింది. కొంచెం టికెట్స్ తీసి పెట్టండి. ప్లీజ్" ముద్దు ముద్దుగా అడిగింది.

"తప్పకుండా! కానీ, మనిషికి రెండు టికెట్లు మాత్రమే ఇస్తారు కదా! ఎలా?"

"రెండు చాలు. ప్లీజ్ హెల్ప్ మీ."

ఆ అమ్మాయి ప్రక్కన మరెవరూ లేకపోవడంతో ఆమె ఒక్కతే వచ్చింది కాబోలు! సో! సినిమా హాల్లో తనూ, తన ప్రక్కన ఈ అందాలబొమ్మ, ఆ వూహకే ఉబ్బితబ్బిబ్బయిపోయాడు నిరంజనం.

ఎలాగైతేనేం, టక్ చెరిగిపోయి, క్రాఫ్ పాడయిపోయినా టికెట్లతో దిగ్విజయంగా బైటికి వచ్చాడు నిరంజనం.


"ఎవడీ ఓల్డ్ యంగ్ హీరో? నీ వైపే చూస్తున్నాడు ఇందాకణ్ణించీ. ఓ లుక్కేయ్యమంటావేంటీ?" బుల్లెమ్మ భుజాల మీద చెయ్యేసి అడిగాడు ఆ పిల్ల బాయ్‌ఫ్రెండ్, అప్పుడే వచ్చాడతను.

"ష్! అయనే మన టికెట్ దాత. కుర్రాడిలా వున్నారు సార్ మీరు అని మస్కా కొట్టాన్లే. పాపం నిజమనుకున్నాడు" ఆమె గుసగుసగానే అన్నా, నిరంజనం చెవిలో పడనే పడింది ఆ మాట.

దగ్గరకు వచ్చిన నిరంజనం చేతిలోని టికెట్లను లాగేసుకుని

"చాలా థాంక్స్ అంకుల్. మీరు లేకపోతే మాకు సినిమా చూసే అదృష్టం వుండేది కాదు, ఓ.కె. టైం అయిపోతోంది. షో బిగినయ్యిందో ఏమో! పద సునీల్. థాంక్యూ అండ్ సీ యూ విత్ లేటెస్ట్ ట్రెండ్ గార్మెంట్స్. బై అంకుల్" బాయ్‌ఫ్రెండ్‌తో కలిసి థియేటర్లోకి ఒకటే పరుగు.

కత్తివేటుకి నెత్తురు చుక్కలేదు నిరంజనం మొహంలో.హమ్మ! హమ్మ! ఎంత మోసం?



ప్చ్, తనకు బుద్ధి వుండద్దూ! ఉన్నదంతా పోకులకి ఖర్చు చేసేసాడు తెలివి తక్కువగా.అంతేనా! చచ్చీ, చెడీ సంపాదించిన టికెట్లు కూడా గ్రద్దలా తన్నుకుపోయింది, వాటి డబ్బులు కూడా ఇవ్వకుండా.

అవమానం తోటి, డబ్బులు పోగొట్టుకున్న దిగులుతోటీ, అలాగే నిల్చుని, మర్నాటి నుంచీ ఆఫీసులో ఏం ముఖం పెట్టుకుని అడుగుపెట్టాలో, నాటి నిరంజనం లాగానా, నాటీ నిరంజనం లాగానా అని ఆలోచిస్తున్నాడు పాపం పూర్ నిరంజనం.